# నినాదం


నిఖార్సైన జర్నలిజం

ఆదివారం 22 డిసెంబర్ 2024 | తెలంగాణ ప్రాంతీయం | పేజీలు 12


రాష్ట్ర అప్పులపై త్వరలోనే మరో ప్రజెంటేషన్ ఇస్తా..



2




# రైతుబంధు ఎగ్గొట్టేందుకే.. సబ్ కమిటీ

## సర్కారుపై కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్, డిసెంబర్ 21 (నినాదం న్యూస్): సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ రైతుబంధుపై సబ్ కమిటీ వేసింది రైతుబంధు ఎగ్గొట్టేందుకేనని సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సర్కారు తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఇవాళ ఎన్ని అబద్ధాలు అంటే.. తెలంగాణలోని రైతుల ఆత్మహత్యలపై కూడా ప్రభుత్వం కూడా దిగజారింది. 2014లో అధికారంలో వచ్చిన తర్వాత రైతు ఆత్మహత్యలు సంవత్సరానికి నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం.. 1348 రైతు ఆత్మహత్యలు జరిగాయి. 2015లో 1400, 2016లో 645, 2017లో 851, 2018లో 908 రైతు ఆత్మహత్యలు జరిగాయి. 2019లో రైతుబంధు స్టార్ట్ అయ్యాక 2019లో 499, 2020లో 471, 2021లో 359, 2022లో కేవలం 178 రైతు ఆత్మహత్యలు జరిగాయి. ఇది రైతుబంధు, రైతుబీమా ప్రభావం కాదా? పెరిగిన వ్యవసాయ విస్తరణ ఫలితం కాదా? అందుబాటులోకి వచ్చిన మిగతా2లో

### నాణ్యమైన విద్యతోనే
# సమసమాజ స్థాపన సాధ్యం

- 77ఏండ్ల స్వాతంత్ర్యంలో పాలకుల పాలనలో మార్పులేదు
- అణగారిన వర్గాలకు చదువుకునే అవకాశం ఇస్తలేరు
- ఇఫ్లు విద్యార్థి సంఘ అధ్యక్షులు పోరిక వికాస్



వరంగల్ బ్యూరో, డిసెంబర్ 21 (నినాదం న్యూస్): పట్టణాలకే పరిమితమైన నాణ్యమైన విద్య ప్రతి పల్లెకు చేరితేనే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ విద్యార్థి సంఘ అధ్యక్షులు పోరిక వికాస్ అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ జిల్లాల పూలే యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షులు తాడిశెట్టి క్రాంతికుమార్ అధ్యక్షతన శనివారం పోరిక వికాస్ కు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలోని అసమానతలను తొలగించి సమసమాజ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించే విద్య పట్టణాలకు పరిమితమై సంపన్నుల అభివృద్ధికి మాత్రమే ఉపయోగపడేదిగా కొనసాగుతుందని ఆయన వాపోయారు. స్వాతంత్రం వచ్చి 77 ఏండ్లు దాటినా దేశాన్ని ఏలుతున్న పాలకుల పాలనలో మార్పు రాలేదని, తరతరాలుగా శ్రమలో, ఉత్పత్తిలో, చాకిరిలో కొనసాగుతున్న ప్రజలకు గొర్లు, బర్రెలు, చేపలు ఇస్తూ ఆ వృత్తిలో కొనసాగాలనే ఆలోచనలు చూస్తున్నారని అన్నారు. దేశంలో మెజార్టీ సంపదను చేజిక్కించుకున్న పాలక కులాలు అణగారిన వర్గాలకు అధికారం రానివ్వడం లేదని, అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్న మాలాంటి తొలి తరం నాయకులందరూ ఐక్యంగా ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరముందని అన్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో రాణించాలన్న విద్య ప్రధానమైందని, అలాంటి విద్య దేశంలోని ప్రజలందరికీ సమానంగా అందడం లేదని, నేటికీ అత్యున్నత కేంద్ర విశ్వ విద్యాలయాల్లో అణగారిన వర్గాలను చదువనివ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశంలోని ప్రతి గ్రామానికి నాణ్యమైన సమాన విద్య అందించే ఉద్యమంలో తాను మిగతా2లో

### 24 గంటలు ఉచిత కరెంట్ ఇస్తే
# రాజీనామా చేస్తా

మాజీ మంత్రి కేటీఆర్

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,

కేటీఆర్‌ల మధ్య మాటల యుద్ధం

2లో

# టవర్ ఎక్కిన హోంగార్డు

## ఎన్నికల హామీని నెరవేర్చాలంటూ డిమాండ్

హైదరాబాద్, డిసెంబర్ 21 (నినాదం న్యూస్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి తమకు ఉద్యోగాలివ్వాలని ఓ మాజీ హోంగార్డు ఆందోళనకు దిగారు. స్పష్టమైన హామీ ఇచ్చేవరకు దిగేది లేదంటూ హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియం వద్ద టవర్‌పైకి ఎక్కి భీష్మించుకు కూర్చున్నారు. రోడ్డుమీద పడ్డ తమ జీవితాలను ఆదుకోవాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో హోంగార్డుగా మిగతా2లో



# రాష్ట్ర అప్పులపై త్వరలోనే మరో ప్రజెంటేషన్ ఇస్తా ..

## • హరీశ్‌రావు కీలక ప్రకటన

**హైదరాబాద్, డిసెంబర్ 21 (నినాదం న్యూస్):** రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అబద్ధపు ప్రచారాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు హరీశ్‌రావు మండిపడ్డారు. పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన అప్పు రూ.4.17 కోట్లు మాత్రమేనని మరోసారి స్పష్టం చేశారు. తాము కూడా గత ప్రభుత్వాలు వారసత్వంగా ఇచ్చిన అప్పులను కడుతూనే.. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అంతేతప్ప సీఎం రేవంత్ రెడ్డిలా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎగ్గొట్టలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ఎల్పీలో శనివారం హరీశ్‌రావు మాట్లాడుతూ.. నీకు చేతగాక.. బీఆర్ఎస్ మీద అబద్ధాలు చెబితే విడిచిపెట్టమని హెచ్చరించారు. దబాయింపులతో జులుం చేసే ప్రయత్నం చేశారని సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. క్లారిఫికేషన్ ఇచ్చేందుకు మైక్ అడిగినా.. ఇవ్వకుండా సభను వాయిదా వేసుకుని వెళ్లిపోయారని విమర్శించారు. అప్పుల గురించి ముఖ్యమంత్రి మాట్లాడారని.. దానిపై క్లారిఫికేషన్‌కు మైక్ ఇవ్వాలి కదా అని ప్రశ్నించారు. అప్పుల గురించి ఒక జోక్ అయిపోయిందని ఎద్దేవా చేశారు. అప్పుల గురించి ఈ మంత్రులు ఎప్పుడెప్పుడు ఏమేమీ మాట్లాడారో పాత వీడియోలు తీసి.. ఒక్క దగ్గర వేసి చూపిస్తే వాళ్లకు సిగ్గొస్తుందని అన్నారు. పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన అప్పు రూ.4.17లక్షల కోట్లే అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి వారసత్వంగా 72 వేల కోట్ల అప్పు వచ్చిందని తాను అసెంబ్లీలో చెప్పానని తెలిపారు. అది 72వేల కోట్లు మాత్రమే కాదని అన్నారు. మీరు అధికారం తీసుకున్నప్పటికీ.. పాత కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పు అది ఆయన స్పష్టం చేశారు. పైగా 11 వేల కోట్లు కార్పొరేషన్లకు అప్పు ఉందని అన్నారు. అంటే 83వేల అప్పు ఉందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డిసెంబర్ 7 నుంచి మార్చి 31 వరకు చేసిన 15 వేల కోట్లు ఉందన్నారు. ఇదే లక్ష కోట్లు అవుతుందని పేర్కొన్నారు. ఇవేవీ అప్పుల చిట్టాలో కలపలేదని అన్నారు. పదేండ్ల తర్వాత మీరు అధికారంలోకి వచ్చేసరికి కూడా రూ.72వేల కోట్ల అప్పు ఉందని హరీశ్‌రావు తెలిపారు. ఈ పదేండ్లలో పాత కాంగ్రెస్ ప్రభుత్వం వారసత్వంగా ఇచ్చిన అప్పులకు మిత్తీల రూపంలో 3లక్షల కోట్లు కట్టామని పేర్కొన్నారు. మూడు లక్షల కోట్ల అప్పు కట్టుకుంటూనే అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేశామని చెప్పారు. రైతుబంధు ఇచ్చాం.. రైతు బీమా ఇచ్చాం.. 2వేల పింఛన్ ఇచ్చాం.. కల్యాణలక్ష్మీ ఇచ్చాం.. కేసీఆర్ కిట్ ఇచ్చాం.. ప్రాజెక్టులు కట్టాం.. మంచినీళ్లు ఇచ్చాం.. సబ్‌స్టేషన్లు కట్టాం.. 24 గంటల కరెంట్ ఇచ్చామని గుర్తుచేశారు. నీలెక్క అప్పులు అప్పులు అని చెప్పి.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎగ్గొట్టే ప్రయత్నం చేయలేదని స్పష్టం చేశారు. నీకు చేతగాక.. ప్రజల ముందుకు వెళ్లలేక బీఆర్ఎస్ మీద అబద్ధాలు చెప్పి తప్పించుకోవాలని ప్రయత్నిస్తే విడిచిపెట్టమని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు హెచ్చరించారు. త్వరలోనే ఎడిటర్లు, ఇంటెలెక్చువల్స్ అందర్నీ పిలిచి ఈ అప్పులపై మరో ప్రజెంటేషన్ ఇస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ చెబుతున్న అబద్ధాలను బయటపెట్టి.. ప్రజా క్షేత్రంలో నిలబెడతామని అన్నారు.

# నాణ్యమైన విద్యతోనే సమసమాజ స్థాపన సాధ్యం

(మొదటిపేజీ తరువాయి..)
ముందుంటానని అన్నారు. ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో జన్మించి అట్టడుగు వర్గాల నుండి ఆసియా ఖండంలోనే పేరొందిన ఇఫ్లు విశ్వవిద్యాలయంలో ప్రవేశం సాధించడమే కాకుండా విద్యార్థి నాయకుడిగా పోరిక వికాస్ ఎన్నిక కావడం అణగారిన వర్గాలకు గర్వకారణమని అన్నారు. వేల ఏండ్లుగా వివక్షకు గురవుతున్న దేశ మూలవాసుల విముక్తి కోసం జరిగే పోరులో వికాస్ లాంటి నాయకులు ముందుండాలని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రజనీలత మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యతో పాటు నాయకత్వ లక్షణాలు అభివృద్ధి జరిగితే దేశానికి మేలు జరుగుతుందని అన్నారు. కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కొంగ వీరాస్వామి మాట్లాడుతూ పోరిక వికాస్ లాంటి విద్యార్థి, యువజన నాయకులు దేశంలో జరుగుతున్న వివక్షను అధ్యయనం చేయాలని, సామాజిక న్యాయం కోసం జరిగే సమరంలో విద్యార్థులు ముందుండాలని అన్నారు. న్యాయవాది ఎగ్గడి సుందర్ రామ్ మాట్లాడుతూ వికాస్ లాంటి తొలితరం నాయకులకు సామాజిక ఉద్యమకారులు అండగా నిలవాలని, విలువల సమాజ నిర్మాణం కోసం ప్రగతిశీల శక్తులు ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కెడిసి ఆంగ్ల అధ్యాపకులు శ్రీకాంత్, ఎల్ బి కళాశాల అధ్యాపకులు శాగంటి మంజుల, ఆల్ ఇండియా ఒబిసి జాక్ వైస్ చైర్మన్ పటేల్ వనజ, వి.సి.కె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలకర శ్రీనివాస్, ట్రైబల్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు పోరిక ఉదయ్ సింగ్ నాయక్, కెయు అసిస్టెంట్ ప్రొఫెసర్ కొంగ వీరాస్వామి, వివిధ సంఘాల నాయకులు వల్లాల జగన్, సుందర్ రామ్, శివ నాస్తిక్, ధనలక్ష్మి, సద్గుణ, గారే జయరాజ్ తదితరులు పాల్గొని వికాస్ ను శాలువాలతో సత్కరించి పుస్తకాలను బహుకరించారు.

# రైతుబంధు ఎగ్గొట్టేందుకే సబ్ కమిటీ

(మొదటిపేజీ తరువాయి..)
చెరువులు, కాళేశ్వరం ప్రాజెక్టులతో స్థిరీకరించబడ్డ సాగు కాదా? వ్యవసాయం కాదా? ఇది ప్రామాణికం కాదా?' అంటూ నిలదీశారు.

**సీఎం రేవంత్‌వి నికృష్టపు మాటలు..**

'రైతు ఆత్మహత్యల్లో భారతదేశంలో తెలంగాణ భాగస్వామ్యం 11శాతం ఉండేది. దాన్ని 1.57శాతానికి తగ్గిస్తే.. దాన్ని కూడా చిన్నగా చేసి.. చూపే చిల్లరప్రయత్నం రేవంత్‌రెడ్డి చేసిండు. ఇంకా నికృష్టపు మాటలు. వీళ్లు మాకు అప్పచెప్పిన నాటే సర్‌ప్లస్‌గా ఇచ్చినం అని చెబుతున్నడు. రేవంత్‌రెడ్డికి చరిత్ర తెలియదు.. వర్తమానం తెల్వదు. లెక్కలు అంతకన్నా తెల్వదు. తెలంగాణ, ఆంధ్రాతో కలిసిన నాడే 1956 సంవత్సరంలో సర్‌ప్లస్ స్టేట్. 1968లో సర్‌ప్లస్ స్టేట్ తెలంగాణ మొదటి సారి ప్రారంభమైనప్పుడు. 2001లో రెండోదశ ఉద్యమం ప్రారంభమైనప్పుడు సర్‌ప్లస్ స్టేట్. 2014లో తెలంగాణ వచ్చినప్పుడు సర్‌ప్లస్ స్టేట్. కొత్తగా నీ కాంగ్రెస్ పార్టీ పీకింది లేదు. ఇచ్చింది ఏం లేదు. మీ ప్రభుత్వం ఊడబొడిచిందేమీ లేదు. ఇంకా సిగ్గుమాలిన మాట. ఒక సంవత్సరంలో రూ.20వేలకోట్లు రుణమాఫీకి ఇచ్చినం అన్నడు. కేవలం ఇచ్చింది లెక్కగడితే రూ.12వేలకోట్లు దాటదు. కానీ, అదే మా ప్రభుత్వం పదేళ్లలో రూ.28వేలకోట్ల రుణమాఫీ రెండు దఫాల్లో. మరో వైపు రూ.73వేలకోట్ల రైతుబంధు. ఈ రెండు కలిపితే రైతుల ఖాతాల్లో పైసలు లెక్కపెడితే రూ.లక్ష కోట్లు దాటింది' అని తెలిపారు.

**రైతుబంధు దేశానికే ఆదర్శం..**

'ఇవాళ రైతుబంధు భారతదేశానికి ఆదర్శమైంది. పీఎం కిసాన్‌గా పేరు మారింది. కృషిబంధు బెంగాల్‌లో.. ఇంకా చాలా రాష్ట్రాల్లో పేరు మారింది. ఇవాళ ప్రభుత్వాన్ని ఒక్కటే అడుగుతున్నాం. రాష్ట్ర రైతాంగానికి విజ్ఞప్తి చేస్తున్నాం. సబ్ కమిటీ వేసిందే టైమ్‌పాస్‌కి, రైతుబంధు ఎగ్గొట్టెందుకు, కోత పెట్టేందుకు. ఉద్యోగస్తులకు నేను ఇయ్యా రైతుబంధు ఇవ్వ నని ఎందుకు చెప్పలేదు అని నేను ఇవాళ అడిగినా.. ఉద్యోగస్తుడి తల్లిదండ్రులు వ్యవసాయదారులైతే.. ఆ ఉద్యోగస్తుడు వ్యవసాయ కుటుంబం నుంచే.. సాయంత్రం ఉద్యోగం నుంచి వస్తే పోయి వ్యవసాయం చేయడా? ఆయనకు భూమితో ఉన్న కనెక్షన్ ఎందుకు కట్ చేస్తున్నవ్. ఆయనను ఎందుకు రైతుగా గుర్తిస్తలేవు అని అడిగినాను. తెలంగాణలో 1.30కోట్ల పాన్ కార్డులు ఉన్నయ్. పాన్ కార్డ్ నిబంధన పెడితే మిగేలదీ ఎవరు? ఆలోచించాలని కోరిన. ఐటీ అంటున్నవ్.. ఆదాపు కట్టె వారిలో రైతుబిడ్డలు అయిన ఉద్యోగులు ఉన్నరు. జర్నలిస్టులు ఉన్నరు. ఐటీ కట్టేవారందరికీ రైతుబంధు తీసేస్తానంటే.. ఎవడు మిగులుతడు ? అందుకే నేను అడిగినా సమాధానం లేదు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# టవర్ ఎక్కిన హెూంగార్డు

(మొదటిపేజీ తరువాయి..)
విధులు నిర్వహించిన వీరాంజనేయులు.. టవరెక్కి ఆందోళనకు దిగారు. తాను ఉమ్మడి రాష్ట్రంలో విధులు నిర్వహించానని చెప్పారు. 250 మంది హెూంగార్డులను సమైక్య పాలకులు అన్యాయంగా తొలగించారని తెలిపారు. పదేండ్లపాటు విధులు నిర్వహించామని వెల్లడిరచారు. అప్పట్లో అన్ని డిపార్ట్‌మెంట్లలో విధులు నిర్వహించామని, తమకు గుర్తింపుగా సర్టిఫికెట్లు, బ్యాంక్ అకౌంట్లు, హెల్త్ కార్డులు ఉన్నాయని పేర్కొన్నారు. అప్పట్లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నామని తమపై కక్షగట్టిన ప్రభుత్వం విధుల నుంచి తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే అధికారంలోకి రాగానే తమను విధుల్లోకి తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు. ఏడాది గడుస్తున్నా తమను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. తమ గురించి అసెంబ్లీలో చర్చించాలని, తొలగించిన 250మంది హెూంగార్డులను విధుల్లోకి తీసుకొని తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



## 24 గంటలు ఉచిత కరెంట్ ఇస్తే

# రాజీనామా చేస్తా..

## • మాజీ మంత్రి కేటీఆర్

## • మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కేటీఆర్‌ల మధ్య మాటల యుద్ధం



**హైదరాబాద్, డిసెంబర్ 21 (నినాదం న్యూస్):** శాసనసభలో రైతుభరోసాపై స్వల్ప కాలిక చర్చ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. 24 గంటల విద్యుత్‌పై ఇద్దరి మధ్య తీవ్ర చర్చ జరిగింది. సభ వాయిదా వేసి అందరం నల్గొండ పోదాం.. ఈ రోజు ఒక్క లాగ్ బుక్కులో అయినా.. 24 గంటల కరెంట్ ఇస్తున్నట్లు చూపెడితే.. బీఆర్ఎస్ శాసనసభా పక్షం మొత్తం రాజీనామా చేస్తామని మంత్రి కోమటిరెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. గతంలో 24 గంటల విద్యుత్ ఇవ్వలేదని మంత్రి కోమటిరెడ్డి సభను తప్పుదోవ పట్టించడం సరికాదు. బీఆర్ఎస్ పాలనలో సగటున 19.2 గంటల విద్యుత్ ఇచ్చినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కనే చెప్పారు. ఈ విషయాన్ని ఆయనను అడగాలని కాంగ్రెస్ సభ్యులకు సూచిస్తున్నాను. సభ వాయిదా వేసి నల్లగొండ జిల్లాకు వెళ్లి విద్యుత్ పరిస్థితులు పరిశీలిద్దాం. మంత్రి కోమటిరెడ్డి కోరినట్లు ఎలక్ట్రిసిటీ, మిషన్ భగీరథపై చర్చ పెట్టండి.. చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం. నల్లగొండ జిల్లా అభివృద్ధిపై కూడా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. మరో పది రోజులు సమావేశాలు పొడిగించాలని కోరుతున్నాను. గతంలో జరిగిన తప్పులు ఎత్తిచూపితే మీకు ఇబ్బందిగా ఉంది. గతంలో చేపట్టిన ప్రాజెక్టులకు మాత్రం డబ్బా కొట్టడం సబబా..? అని కేటీఆర్ ప్రశ్నించారు.

## హైవేపై 8సార్లు పల్టీలు కొట్టిన కారు

**జైపూర్, డిసెంబర్ 21 (నినాదం న్యూస్) :** హైవేపై వేగంగా వెళ్లిన కారు అదుపుతప్పింది. రోడ్డుపై 8 సార్లు పల్టీలు కొట్టింది. అయితే అదృష్టవశాత్తు ఆ కారులో ప్రయాణించిన ఐదుగురు వ్యక్తులకు చిన్నగాయమైనా కాలేదు. పైగా అక్కడున్న వారిని టీ అడిగారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం కొందరు వ్యక్తులు నాగౌర్ నుంచి బికనీర్ వెళ్లేందుకు ఎస్‌యూవీలో ప్రయాణించారు. అయితే హైవేపై వేగంగా వెళ్తున్న ఆ కారు ఒక మలుపు వద్ద అదుపుతప్పింది. డ్రైవర్ స్టీరింగ్‌పై కంట్రోల్ తప్పడంతో ఆ కారు రోడ్డుపై ఎనిమిది సార్లు పల్టీలు కొట్టింది. రహదారి పక్కన ఉన్న కారు షోరూమ్ గేట్‌ను బలంగా ఢీకొట్టి ఆగింది. కాగా, కారు పల్టీలు కొడుతుండగా డ్రైవర్ కిందకు దూకేశాడు. కారులోని మిగతా నలుగురు వ్యక్తులు ప్రమాదం తర్వాత కిందకు దిగారు. అయితే అదృష్టవశాత్తు ఎవరికీ కూడా చిన్న గాయమైనా కాలేదు. ఈ సంఘటన తర్వాత కారు షోరూమ్‌లోకి వెళ్లిన ఆ వ్యక్తులు తమకు టీ ఇవ్వాలని అడిగినట్లు అక్కడున్న ఆ ఏజెన్సీ అధికారి తెలిపారు. కారు ఎనిమిది సార్లు పల్టీలు కొట్టినప్పటికీ అందులో ప్రయాణించిన వ్యక్తులు అద్భుతంగా ప్రమాదం నుంచి తప్పించుకున్నట్లు చెప్పారు. మరోవైపు ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## ఉజ్జయిని మహాకాళేశ్వర దేవాలయంలో విషాదం



**భువనేశ్వర్, డిసెంబర్ 21 (నినాదం న్యూస్) :** మధ్యప్రదేశ్ రాష్ట్రంలో గల ఉజ్జయిని మహాకాళేశ్వర దేవాలయంలో విషాదం చోటు చేసుకుంది. ఆలయంలోని ఫుడ్ సెంటర్ లో గల యంత్రంలో దుపట్టా చిక్కుకుని మహిళ మృతి చెందింది. శనివారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రజనీ ఖత్రీ అనే 30 ఏళ్ల మహిళ శనివారం ఉదయం ఆలయంలోని అన్న క్షేత్రంలోగల వంటగదిలో పనిచేస్తోంది. ఆ సమయంలో ఆమె మెడకు ఉన్న దుపట్టా బంగాళాదుంపలు కట్ చేసే యంత్రంలో చిక్కుకుపోయింది. అనంతరం దుపట్టా ఆమె మెడకు బిగుసుకుపోవడంతో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయింది. గమనించిన సిబ్బంది రజనీ ఖత్రీని ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. నివేదిక తర్వాత ఆమె మృతికి గల కచ్చితమైన కారణాలు వెల్లడవుతాయని అధికారులు పేర్కొన్నారు.

## కానిస్టేబుల్ ఇంట్లో 40 కేజీల వెండి లభ్యం



**న్యూఢిల్లీ, డిసెంబర్21 (నినాదం న్యూస్) :** మధ్యప్రదేశ్‌లోని భూపాల్‌లో భారీగా వెండి స్వాధీనం చేసుకున్నారు. లోకాయుక్త జరిపిన తనిఖీల్లో సుమారు 40 కిలోల వెండి లభ్యమైంది. రవాణా శాఖలో కానిస్టేబుల్‌గా చేసిన వ్యక్తి ఇంట్లో లోకాయుక్త తనిఖీలు చేపట్టింది. అయితే ఆ సెర్చ్‌లో వెండి చిక్కింది. దీంతో పాటు కొంత నగదును కూడా సీజ్ చేశారు.

## ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్ : బీజేపీలోకి కీలక నేతలు

**న్యూఢిల్లీ, డిసెంబర్21 (నినాదం న్యూస్) :** అసెంబ్లీ ఎన్నికల ముందు దేశ రాజధాని ఢల్లీలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఇద్దరు కీలక నేతలు బల్బీర్ సింగ్, సుఖ్‌బీర్ దలాల్ రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఢల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ, పార్టీ జనరల్ సెక్రెటరీ ఆశీశ్ సూద్, కేంద్ర మంత్రి హర్ష మల్హోత్ర సమక్షంలో ఆ ఇద్దరు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బల్బీర్ సింగ్ ఏకంగా ఆరు పర్యాయాలు ఢల్లీ సిక్ గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. బీజేపీ ప్రభుత్వం తన సూచనను పరిగణలోకి తీసుకోవడం లేదని, ఢల్లీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే స్కూళ్లలో పంజాబీ టీచర్‌లను నియమించడం లేదని ఆయన ఆరోపించారు. ఢల్లీ సర్కారు ఏ పనీ సరిగా చేయడం లేదని సుఖ్‌బీర్ దలాల్ విమర్శించారు. కాగా, ఢల్లీలో వచ్చే ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పటికే అన్ని స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. బీజేపీ కూడా త్వరలో తమ జాబితాను వెల్లడిరచే అవకాశం ఉంది. ఢల్లీ మాజీ ముఖ్యమంత్రి అర్విండ్ కేజ్రీవాల్ న్యూఢల్లీ నుంచి, ముఖ్యమంత్రి అతిషి కల్కాజీ నుంచి, మంత్రులు సౌరభ్ భరద్వాజ్ గ్రేటర్ కైలాస్ నుంచి, గోపాల్ రాయ్ బాబర్‌పూర్ నుంచి బరిలో దిగనున్నారు.

## ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌గా మధుమూర్తి

**అమరావతి,డిసెంబర్21(నినాదం న్యూస్) :** ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌గా మధుమూర్తి నియమితులు అయ్యారు. ఆయనను నియమించినట్లు విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం వరంగల్ నిట్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సభ్యుడిగా ప్రొఫెసర్ మధుమూర్తి ఉన్నారు. ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి ఉన్నత విద్యామండలికి ఛైర్మన్‌గా నియమించింది.

# టెక్నాలజీ బంధాలను దూరం చేస్తోందా

**హైదరాబాద్, డిసెంబర్21 (నినాదం న్యూస్) :** టెక్నాలజీ బంధాలను బలోపేతం చేస్తోందా, మనుషులను దూరం చేస్తోందా అనేది మిలియన్ డాలర్ ప్రశ్న. ఆధునిక టెక్నాలజీ ప్రపంచాన్ని అరచేతిలో పెట్టేస్తోంది. కానీ, మన చిన్న ప్రపంచాన్ని మాత్రం కొన్ని మైళ్ల దూరానికి తీసుకుపోతోంది. మునపటి తరానికి ప్రస్తుత తరానికి ఆలోచనలు, ఆచరణలో చాలా తేడా వుంది. దీనికి ప్రధాన కారణం టెక్నాలజీ అని చెప్పవచ్చు. తరానికి తరానికి మధ్య ఈ తేడా ఉండటం సహజమే కానీ. కానీ ఈ సహస్రాబ్ది జనరేషన్ స్పీడ్ మామూలుగా లేదు. పాతిక, ముప్పయ్ ఏళ్ల క్రితం మొబైల్ ఫోన్లు లేవు, స్కూలు, కాలేజీ నుంచి ఇంటికి వచ్చి అమ్మా నాన్నలతోనే గడిపేవారు. ఇప్పటిలా ఇంట్లో వేర్వేరు గదులు లేవు. హాల్‌లోనే చదువులు ఉండేవి. పిల్లలు రహస్యంగా ఏ పని చేయాలన్నా కష్టంగానే ఉండేది. తల్లిదండ్రులు, ఇంట్లో పెద్దవాళ్లు ఓ కంట కనిపెట్టేవారు. పిల్లలు తల్లిదండ్రుల మాటకు చాలా విలువ ఇచ్చేవాళ్లు. కానీ ఇప్పుడు, 13, 14 ఏళ్లకే పిల్లల చేతికి మొబైల్ ఫోన్ వస్తోంది. స్కూలులో పాఠాలు నేర్చుకోవడానికి, రీసెర్చ్‌కి మొబైల్ ఫోన్ లేకపోతే ఎలా అని అడగడంతో, తోటి పిల్లల దగ్గర ఎక్కడ తక్కువైపోతారో, చదువులో ఎక్కడ వెనకబడిపోతారో అనే భయంతో తల్లిదండ్రులు పిల్లల చేతిలో స్మార్ట్ ఫోన్ పెట్టక తప్పట్లేదు. మొబైల్ చేతిలోకొచ్చాక వాళ్ల స్నేహాలు ఎవరితో ఎలా ఉంటున్నాయో అంచనా వేయలేరు. సైబర్ నేరాలు, సైబర్ మోసాలు, ఆడపిల్లలను మోసం చేయడం, అపరిచితులతో స్నేహాలు, డేటింగ్ ఇవన్నీ మొబైల్ ఫోన్ల వల్ల పెరుగుతున్నాయి. టెక్నాలజీ చేతుల్లోకి రాగానే, ప్రపంచం చేతుల్లోకి వచ్చేసింది. గత తరంలో పిల్లలు తమకు తెలియని విషయాల గురించి పెద్దవాళ్లను ప్రశ్నలు అడిగేవారు. ఇప్పుడు గూగుల్ తల్లిని అడుగుతున్నారు. ఫోన్లు, టీవీలు పిల్లలకు ఫ్రెండ్స్‌గా మారిపోయాయి. ఇంటికి చుట్టాలు, స్నేహితులు వస్తే, వాళ్లతో గడపడానికి, కనీసం ఐదు నిమిషాలు పలకరించేందుకు కూడా ఈ తరం పిల్లలకు ఓపిక ఉండటం లేదు. అవతలి వ్యక్తులు మాట్లాడుతుంటే, వీళ్లు ఫోన్లు చూసుకుంటూ, ఇంటికొచ్చిన వారి పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇది పేరెంట్స్ పెంపకం తప్పో, టెక్నాలజీ తప్పో అర్థం కాని పరిస్థితి. ఇక, ఇంట్లో అందరూ కలిసి భోజనం చేసే సంస్కృతి ఎప్పుడో పోయింది. దీంతో, కుటుంబ సభ్యుల మధ్య మాటలే కరువయ్యాయి. డబ్బులు కావాలంటే మాత్రం ప్రేమగా ఓ ఐదు నిమిషాలు మాట్లాడతారు. ప్రతి బంధాన్నీ ఓ డీల్‌లా చూడటం అలవాటైపోయింది. మానవ సంబంధాలు యాంత్రికంగా మారిపోయాయి. అసాధారణ ప్రవర్తనను ఈ జనరేషన్ సాధారణం చేశారు. ఐతే, ఈ తరం వారు దీర్ఘ కాలంలో ఒత్తిడికి, అసహనానికి లోనయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. క్షణకాలపు ఆకర్షణలో ఏర్పడే పరిచయాలకు శాశ్వతత్వం ఉండదు. ఆన్‌లైన్ చాట్‌లు, కొన్ని రోజులు గడిపిన తర్వాత గొడవలు సాధారణం అయ్యాయి. సైబర్ సైకాలజీ, బిహేవియర్ అండ్ సోషల్ నెట్ వర్కింగ్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనంలో ఆన్‌లైన్‌లో కలిసిన జంటల సంబంధాలు ఆఫ్‌లైన్‌లో కలిసిన వారి కంటే భిన్నంగా ఎలా ఉంటాయనే అంశాలను పరిశీలించింది. ఈ అధ్యయనంలో ఆన్‌లైన్ డేటింగ్‌లో ఏర్పడే సంబంధాలు విఫలమవుతాయని, బలహీనంగా ఉంటాయని చెప్పడం తప్పు అని అధ్యయనకారులు పేర్కొన్నారు. నేటి యువత సంబంధాలను ఏర్పరచుకోవడంలో, నిర్వహించడంలో టెక్నాలజీ కీలకమైన మార్పులు తీసుకువచ్చింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ లాంటి సోషల్ విరీడియా ఎ÷%-%లాట్ ఫారాలు వాట్సాప్, సిగ్నల్ లాంటి మెసేజింగ్ అప్లికేషన్లు తక్షణ కనెక్టివిటీని అందిస్తున్నాయి. దూరంతో సంబంధం లేకుండా సులువుగా కమ్యూనికేట్ చేయడానికి, కొత్త స్నేహాలను ఏర్పరచుకోవడానికి సహాయపడుతున్నాయి. మరోవైపు ఈ కనెక్టివిటీని అధికంగా ఉపయోగించడం నిజమైన బంధాలకు ఆటంకంగా మారవచ్చు. ఒంటరితనం, అసంతృప్తికి కారణం కావచ్చు. మితివీరిన స్క్రీన్ టైం వంటి అంశాలు ముఖాముఖి సంబంధాలను తగ్గిస్తాయి. దీనివల్ల సోషల్ స్కిల్స్, ఎమోషనల్ స్కిల్స్ మందగించవచ్చు. కాబట్టి, టెక్నాలజీని బ్యాలెన్స్‌గా వాడుకోవాలని యువత గుర్తించాలని అంటున్నారు సైకాలజిస్టులు.

# కార్గిల్‌లో చొరబాట్లు గుర్తించిన గొర్రెల కాపరి

- **పాక్ సైన్యానికి గుర్తించి ఆర్టీకి ఉప్పందించిన దేశభక్తుడు**
- **హఠాన్మరణం చెందిన తాషి నామ్‌గ్యాల్**

**శ్రీనగర్, డిసెంబర్21(నినాదం న్యూస్) :** కార్గిల్ యుద్ధానికి కారణమైన పాక్ చొరబాట్లను గుర్తించిన ఓ సామాన్య గొర్రెల కాపరి మృతి చెందాడు. సరిగ్గా పాతికేళ్ల క్రితం భారత్, పాకిస్థాన్ మధ్య భీకర యుద్ధం జరిగిన సంగతి తెలిసిందే. 1999లో జమ్మూకశ్మీర్‌లోని కార్గిల్ ఆక్రమణ కోసం పాక్ పన్నిన కుట్రను భారత సైన్యం భగ్నం చేసింది. మన దేశంలోకి చొచ్చుకొచ్చిన పాక్ బలగాలను చిత్తుగా ఓడిరచి తరిమికొట్టింది. ఈ యుద్ధంలో శత్రువుల చొరబాటును ముందుగా పసిగట్టి మన జవాన్లను అప్రమత్తం చేసిన సామాన్య గొర్రెల కాపారి తాషి నామ్‌గ్యాల్ కన్నుమూశారు. ఈ విషయాన్ని లేష్‌లోని ఫైర్ అండ్ ఫ్యూరీ కార్ప్స్ వెల్లడిరచింది. 58 ఏళ్ల తాషి నామ్‌గ్యాల్ లద్దాఖ్‌లోని ఆర్యన్ వ్యాలీలో హఠాన్మరణం చెందినట్లు తెలిపింది. ఆయన మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఏడాది ఆరంభంలో కార్గిల్ విజయ్ దివస్‌కు 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ద్రాస్‌లో నిర్వహించిన వేడుకలకు తాషి హాజరయ్యారు. ఆయన మృతిపై సైన్యం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ‘ఓ దేశ భక్తుడిని కోల్పోయాం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి. 1999 ఆపరేషన్ విజయ్ సమయంలో ఆయన అందించిన సహకారం చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించి ఉంటుంది. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం‘ అన్ని ÷ర్ అండ్ ఫ్యూరీ కార్ప్స్ సోషల్ విరీడియాలో పోస్ట్ చేసింది. 1999 మే 3వ తేదీన తాషి నామ్‌గ్యాల్ గొర్రెలు కాస్తుండగా ఓ గొర్రె తప్పిపోయింది. దాన్ని వెతుక్కుంటూ వెళ్లగా బటాలిక్ పర్వత ప్రాంతాల్లో చొరబాటుదారులు కన్పించారు. దీంతో వెంటనే ఆయన భారత సైన్యానికి ఉప్పందించారు. దీంతో అసలు వాళ్లెవరో తెలుసుకొనేందుకు భారత్ సైన్యం కెప్టెన్ సౌరభ్ కాలియా నేతృత్వంలోని ఓ పెట్రోలింగ్ పార్టీని మే5న అక్కడికి పంపింది. ఆ తర్వాత వేర్వేరు మార్గాల నుంచి ఆక్రమణదారులకు సమాచారం అందడం మొదలైంది. తొలుత భారత సైన్యం వారిని ఉగ్రవాదులుగా భావించింది. కానీ, వారు వాడుతున్న ఆయుధాలు, పోరాడుతున్న తీరు చూసి పాక్ సైనికులేనని ధ్రువీకరించుకున్నారు. అలా యుద్ధం మొదలైంది. కొన్ని నెలల పాటు కొనసాగిన ఈ యుద్ధంలో దాయాది చిత్తుగా ఓడిపోయింది. జులై 26న పాక్ సైన్యాన్ని తరిమికొట్టినట్లు ఇండియన్ ఆర్మీ ప్రకటించింది. దీంతో ఆ రోజును కార్గిల్ విజయ్ దివస్‌గా చేసుకుంటున్నాం.

# రైతుబంధుపై వాడీవేడీ చర్చ

- **కేటీఆర్ తీరుపై విరుచుకుపడ్డ అధికార ఎమ్మెల్యేలు**
- **పాలమూరును ఎండబెట్టిన ఘనులని జూపల్లి విమర్శలు**
- **అభివృద్ధి నిరూపిస్తే రాజానామాకు సిద్ధమని సవాల్**

**హైదరాబాద్,డిసెంబర్21(నినాదం న్యూస్) :** పాలమూరు ప్రాజెక్టులపై గత బిఆర్ఎస్ అబద్దాలుచెబుతోందని, ఒక్కరాకు నీరందించినట్లు నిరూపించినా రాజకీయ సన్యాసం తీసుకుంటానని మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. అబద్దాలు చెప్పడంలో బిఆర్ఎస్ నేతలు ఆరితేరారరని మండిపడ్డారు. నిజాలు చెప్పడానికి ధైర్యం కావాలన్నారు. పాలమూరును ఎండబెట్టి ఇవ్వాళ్ల నీతులు చెబుతున్నారని అన్నారు. దమ్ముంటే నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని అన్నారు. రైతులను మోసం చేసి వారి గురించి మాట్లాడుతున్నారని
అదికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కూడా కెటిఆర్ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వలేమని చెప్పిన కెసిఆర్ ఇప్పుడు వారి గురించి కెటిఆర్ కన్నీరు ఒలకబోస్తున్నారుని పెద్దపల్లి ఎమ్మెల్యే మండిపడ్డారు.కౌలురైతుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. మరో ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ కాళేశ్వరం పేరుతో కరీంనగర్‌కు చుక్కనీరు రాలేదన్నారు. కాళేశ్వరం పేరుతో అడ్డంగా దోచుకున్నారని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు గతంలో కట్టిన ప్రాజెక్టులే శరణ్యమయ్యాయని అన్నారు. అంతకుముందు రైతుభరోసాపై కెటిఆర్ మాట్లాడగా పలువురు సభ్యులు తీవ్ర విమర్శలు గుప్పించారు. కెసిఆర్ పాలనపై మండిపడ్డారు. సాగు విస్తీర్ణం పెరగాలనే ఉద్దేశంతోనే రైతుబంధు ఇచ్చామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. ‘201920లో సాగు విస్తీర్ణం 141 లక్షల ఎకరాలుంది. 2020-21లో సాగు విస్తీర్ణం 204 లక్షల ఎకరాలని నివేదికలో చెప్పారు. రైతుబంధు ఇవ్వడం వల్లే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఇదే విషయాన్ని ప్రభుత్వం ఇచ్చిన నోట్ స్పష్టం చేస్తోంది. 4.50 లక్షల మంది గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చాం. పోడు పట్టాలున్న గిరిజనులకు రైతుబంధు ఇస్తారో.. లేదో ప్రభుత్వం చెప్పాలి. రైతుబంధుకు కోతలు పెట్టే ఉద్దేశం ప్రభుత్వానికి ఉంది. లేకపోతే.. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి గురించి మంత్రి చెప్పేవారు కాదు. తెలంగాణలో పీఎం కిసాన్ సమ్మాన్ 20 శాతం మంది రైతులకే వస్తోంది. రైతుబంధు యథాతథంగా ఇస్తామంటే.. ఈ చర్చ ఎందుకు? పత్తి, కంది 8 నెలల పంట.. ఆర్థిక సాయం ఒక పంటకు ఇస్తారా? రెండు పంటలకు ఇస్తారా అనేది ప్రభుత్వం చెప్పాలి. పామాయిల్, మామిడి, ఉద్యాన పంటలకు రైతుభరోసా ఇస్తారా? 3 పంటలు సాగు చేసే రైతులకు మూడు విడతలుగా ఇస్తారా? మూడో పంటకు ఇవ్వాలని గతంలో రేవంత్ అన్నారు.అసెంబ్లీ సమావేశాలు పది రోజులు పొడిగించాలి. ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, మిషన్ భగీరథపై చర్చ చేపట్టాలి. నల్గొండ జిల్లా అభివృద్ధిపై కూడా ఒకరోజు చర్చ చేపట్టాలి. గతంలో జరిగిన తప్పులు ఎత్తిచూపితే వీరికు ఇబ్బందిగా ఉంది. భారాస హయాంలో 24 గంటల విద్యుత్ ఇవ్వలేదని తప్పుదోవ పట్టిస్తున్నారు.

# కువైట్ ఓ మినీ ఇండియా



**కువైట్,డిసెంబర్21(నినాదం న్యూస్):** పశ్చిమాసియా దేశమైన కువైట్ లో ఇంత మంది భారతీయులను చూడటం చాలా ఆనందంగా ఉందని, ఇదో 'మినీ ఇండియా' లా కనిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. రెండు రోజుల కువైట్ పర్యటనకు వెళ్లిన ప్రధాని.. అక్కడి ప్రవాస భారతీయులతో నిర్వహించిన 'హలా మోదీ' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీ అందరికీ భారత్ నుంచి ఇక్కడికి రావడానికి 4 గంటల సమయం పడితే.. ఓ భారత ప్రధాని ఇక్కడికి రావడానికి 4 దశాబ్దాల సమయం పట్టిందన్నారు. ప్రతి ఏటా వందలాది మంది భారతీయులు ఇక్కడికి వస్తున్నారని, అలా కువైట్ సమాజానికి భారతీయతను పరిచయం చేశారని మోదీ అన్నారు. భారతదేశ ప్రతిభ, సాంకేతికత, సంప్రదాయాలను మేళవించి కువైట్ నేలను భారతీయ నైపుణ్య రంగులతో నింపారని ప్రశంసించారు. ఈ దేశ వైద్యరంగానికి భారతీయ వైద్యులు, పారామెడికోలే ప్రధాన బలమన్నారు. 'కువైట్ భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడంలో భారతీయ ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా మారింది. ఈ దేశ నేతలతో ఎప్పుడు మాట్లాడినా భారతీయుల గురించి ప్రశంసిస్తూనే ఉంటారు. రెమిటెన్స్‌లను (విదేశీ కరెన్సీ) స్వీకరించడంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. మీరంతా కష్టపడి పని చేయడం వల్లే ఈ ఘనత సాధ్యమైంది. భారత్, కువైట్ దేశాలు అరేబియా సముద్రానికి ఇరువైపులా ఉన్నాయి. ఈ రెండు దేశాలను కేవలం దౌత్యసంబంధాలే కలపడం లేదు. హృదయ సంబంధాలు కూడా దగ్గర చేస్తున్నాయి. ఇప్పుడే కాదు.. గతంలోనూ రెండు దేశాల మధ్య సంబంధాలు బాగుండేవి. కువైట్‌కు అవసరమైన మానవ వనరులు, నైపుణ్యత, సాంకేతికతను అందించడం లో భారత్ ముందంజలో ఉంది. రాబోయే కాలంలో ఈ రెండు దేశాలు కేవలం వాణిజ్యపరంగానే కాకుండా పరస్పర శ్రేయస్సు కోరుకునే భాగస్వాములు కూడా అవుతాయి. భారతదేశంలోని స్టార్టప్‌లు, సాంకేతిక కువైట్ అవసరాలకు అత్యాధునిక పరిష్కారాలను చూపించగలవు' అని మోదీ అన్నారు. కొవిడ్ -19 మహమ్మారి సమయంలో భారత్‌కు లిక్విడ్ ఆక్సిజన్‌ను సరఫరా చేసిన కువైట్ ప్రభుత్వానికి ఈ సందర్భంగా మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

# నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం



**హైదరాబాద్,డిసెంబర్21(నినాదం న్యూస్):** థియేటర్ తనకు గుడిలాంటిదని, అక్కడ ప్రమాదం జరగడం నిజంగా బాధగా ఉందని సినీ నటుడు అల్లు అర్జున్ అన్నారు. పోలీసులు, అధికారులు అందరూ కష్టపడి పనిచేసినా, సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. అయితే ఈఘటనతో కుంగిపోయి, బాధిత కుటుంబానికి అండగా నిలిచినా.. తన వ్యక్తిత్వంపై దాడి జరిగిందని, అసత్య ప్రచారాలు సాగుతున్నాయని బాధను వ్యక్తం చేశారు. సిఎం అసెంబ్లీలో ప్రకటన చేసిన అనంతరం అల్లు అర్జున్ వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేశారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు తెలిపారు. అయితే తనపై చేసిన ఆరోపణలన్నీ నిరాధారమైనవని తెలిపారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై శనివారం సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా మాట్లాడారు. అల్లు అర్జున్‌ను థియేటర్‌కు రావొద్దని పోలీసులు చెప్పినా వినకుండా వచ్చారని అన్నారు. బాధిత కుటుంబాన్ని కనీసం ఏ ఒక్క సినీ ప్రముఖుడూ పరామర్శించలేదని మండిపడ్డారు. సీఎం వ్యాఖ్యల నేపథ్యంలో అల్లు అర్జున్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తన వ్యవహారశైలిపై వచ్చిన వార్తలను అల్లు అర్జున్ ఖండించారు. తన క్యారెక్టర్‌ను తక్కువ చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు.'నాపై చేసినవన్నీ తప్పుడు ఆరోపణలే. నేను ఎలాంటి ర్యాలీ చేయలేదు. థియేటర్‌కు కొద్ది దూరంలో నా కారు ఆగిపోయింది. కారు ముందుకు కదల్లేదు. చేయి చూపిస్తూ ముందుకు కదలండని పోలీసులు అంటేనే నేను బయటకు వచ్చి, చేతులు ఊపాను. థియేటర్ లోపలికి వచ్చిన తర్వాత ఏ పోలీస్ లోపలికి వచ్చిన జరిగిన సంఘటన గురించి చెప్పలేదు. థియేటర్ యాజమాన్యం వచ్చి, జనాలు ఎక్కువగా ఉన్నారని చెబితే, బయటకు వచ్చేశాను. తొక్కిసలాటలో మహిళ చనిపోయిన విషయం మరుసటి రోజు వరకూ తెలియదన్నారు. మహిళ చనిపోయిన ఘటన తెలిసి కూడా ఎలా వెళ్లిపోతాను? నాకూ పిల్లలు ఉన్నారు కదా. మరుసటి రోజు విషయం తెలిసిన తర్వాత బన్నీ వాసుకు ఫోన్ చేసి, ఆస్పత్రికి వెళ్లమని చెప్పాను. నేను కూడా బయలుదేరదామని సిద్ధమయ్యా. కానీ, నాపై కేసు నమోదు చేశారని బన్నీ వాసు చెప్పాడు. నా లీగల్ టీమ్ కూడా వద్దని వారించింది. అందుకే నేను ఆస్పత్రికి వెళ్లలేదని అన్నారు. గతంలో పలువురి హీరోల అభిమానులు చనిపోతే పరామర్శించడానికి వెళ్లాను. నా సొంత అభిమానులు చనిపోతే, వెళ్లి కలవనా? జరిగిన ఘటన విషయం తెలిసి షాక్‌లో ఉన్నా. అందుకే ఆలస్యంగా వీడియో పెట్టా. డబ్బులు అనేది ఇక్కడ విషయమే కాదు. చాలా ఈవెంట్లు పెట్టాలని అనుకున్నాం. ఈ ఘటన తర్వాత అన్నింటినీ రద్దు చేశాం. ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి స్పెషల్ అనుమతి తీసుకుని, మా నాన్నను వెళ్లమని చెప్పాను. అదీ కుదరదని అన్నారు. కుదిరితే సుకుమార్‌గారిని వెళ్లమని చెప్పారు. అదీ కాదన్నారు. నేను ఆ కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని అందరూ ఆరోపిస్తున్నారు. కానీ, నా క్యారెక్టర్‌ను చాలా తక్కువ చేసి మాట్లాడుతున్నారు. ఇది మాత్రం మనసుకు తీసుకోలేకపోతున్నా. మీరు థియేటర్‌కు వచ్చి ఎంజాయ్ చేయాలని నేను సినిమాలు చేస్తున్నా. ఈ ఘటన విషయంలో బాధిత కుటుంబాన్ని ఆదుకోవడానికి పెద్ద అమౌంట్ ఫిక్స్‌డ్ చేయాలని అనుకున్నాం. అవసరమైతే ఫిజియో థెరపీ చేయించాలని అనుకున్నాం. తెలుగువారు గర్వపడేలా సినిమా చేశానని అనుకుంటుంటే, మనల్ని మనం కిందకు లాక్కుంటున్నాం' 'నేనెవరినీ నిందించడానికి ఈ ప్రెస్ మీట్ పెట్టలేదు. మా సినిమాకు ప్రభుత్వం అన్ని రకాలుగా సపోర్ట్ చేసింది. అందుకు ధన్యవాదాలు. కానీ, నాపై తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్నారు. నా వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నారు. 22 ఏళ్లుగా కష్టపడి సాధించిన నమ్మకం, గౌరవం ఒక రాత్రిలో పోగొట్టారు. అందుకు బాధగా ఉంది. అంతేగానీ, నాకు ఎవరిపైనా వ్యక్తిగతంగా కోపాలు లేవు. నాకు మానవత్వం లేదనడం సరికాదు. మళ్లీ మళ్లీ చెబుతున్నా, నా వ్యక్తిత్వంపై చేసిన ఆరోపణలన్నీ 100 శాతం అబద్ధం. ప్రస్తుతం న్యాయపరమైన చిక్కులు ఉన్నందున మీ ప్రశ్నలన్నింటికీ త్వరలోనే సమాధానం చెబుతా' అని అల్లు అర్జున్ అన్నారు. 'దయచేసి అర్థం చేసుకోండి. న్యాయపరమైన సమస్యలు ఎదురవుతాయనే ఉద్దేశంతోనే మీ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అల్లు అర్జున్ వెళ్లిపోయారు. తాను చేసిన పాన్ ఇండియా మూవీని థియేటర్‌లో చూసుకుందామనే వెళ్లాడు. థియేటర్ వద్ద జరిగిన ఘటన తర్వాత మా ఇంట్లో పార్కులో ఓ మూలన కూర్చొని అదే ఆలోచనలో ఉన్నాడు. పలువురు సక్సెస్ సెలబ్రేషన్ చేస్తామని చెబుతున్నా, ఎక్కడికీ వెళ్లడం లేదు. ఒక అభిమాని కుటుంబం ఇలా అయిపోయిందని బాధపడుతున్నాడు. 22 సంవత్సరాలు కష్టపడి ఈ పేరు సంపాదించుకున్నదంతా ఒక రాత్రి, ఒక సినిమా, ఒక ప్రెస్‌మీట్‌లో రాలేదు. మూడు తరాలుగా మా కుటుంబం గురించి తెలుసు అన్నారు. అసెంబ్లీలో సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై హాట్ హాట్‌గా చర్చలు నడిచాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంధ్య థియేటర్ ఘటనలో అసలు ఏం జరిగిందనేది.. అసెంబ్లీలో వివరణ ఇచ్చారు. అంతేకాదు, సంధ్య థియేటర్ వద్ద అంత పెద్ద ఘటన జరిగి, ఓ తల్లి చనిపోయి, ఆ తల్లి కొడుకు హాస్పిటల్ ఉంటే ఒక్కరంటే ఒక్కరైనా పరామర్శకు రాలేదు. అల్లు అర్జున్ జైలు నుండి విడుదలగానే టాలీవుడ్ ఇండస్ట్రీ మొత్తం ఆయన ఇంట్లో వాలిపోయింది .

## గిరిజన ప్రాంతాలు షూటింగ్‌కు అనుకూలం : పవన్ కళ్యాణ్

**పార్వతీపురం,డిసెంబర్21(నినాదం న్యూస్):** గిరిజన ప్రాంతాల్లో సినిమా షూటింగ్‌లకు అందమైన ప్రదేశాలు ఉన్నాయని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఇక్కడ షూటింగ్‌ల వల్ల ఖర్చు తగ్గడంతో పాటు, స్థానిక గిరిజనులకు ఉపాధి దక్కుతుందని అభిప్రాయపడ్డారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తున్న పవన్‌కల్యాణ్ సినీ రంగంపై మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో చాలా సుందరమైన ప్రదేశాలున్నాయని, సినిమా పరిశ్రమ ఇక్కడికి వచ్చి సినిమా షూటింగ్‌లు చేయాలని సూచించారు. విదేశాల్లో ఉండే అందమైన ప్రదేశాలు గిరిజన, పల్లె ప్రాంతాల్లోనూ ఉంటాయని తెలిపారు. ఇటువంటి స్థలాల్లో షూటింగ్‌లు చేస్తే గిరిజనులకు ఉపాధి లభిస్తుందని అన్నారు.

## పరస్పర విశ్వాసంపైనే భార్యాభర్తల బంధం

### -సుప్రీం కోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,డిసెంబర్21(నినాదం న్యూస్):** వివాహ బంధంపై సుప్రీం కోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. భార్యాభర్తల బంధం అనేది పరస్పర విశ్వాసంపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. తనకు విడాకులు మంజూరు చేస్తూ మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జంట దాదాపు 20 ఏళ్లుగా దూరంగా ఉంటోంది. గతంలో వీరిద్దరికి విడాకులు మంజూరు చేస్తూ మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ తీర్పు వెలువరించింది. దీన్ని సవాల్ చేస్తూ ఆమె సుప్రీం కోర్టును ఆశ్రయించింది. తాజాగా ఈ కేసును పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం.. హైకోర్టు ఆదేశాలను సమర్థించింది. 'వివాహ బంధం అనేది పరస్పర విశ్వాసం, సహచర్యం, భాగస్వామ్య అనుభవాల పునాదులపై నిర్మితమై ఉంటుంది. ఈ కేసులో దంపతులు ఇవేమీ లేకుండా చాలా కాలంగా వేర్వేరుగా ఉంటున్నారు. ఇద్దరి మధ్య విరోధాలు కనిపిస్తున్న నేపథ్యంలో బంధాన్ని పునరుద్ధరించే అవకాశం లేదనేది స్పష్టమవుతోంది' అని పేర్కొంది.

## నీటి సంఘాల ఎన్నికలు చెంపపెట్టు

### -మంత్రి నిమ్మల రామానాయుడు

**అమరావతి,డిసెంబర్21(నినాదం న్యూస్):** ఆరేళ్ల తర్వాత నిర్వహించిన సాగు నీటి సంఘాల ఎన్నికల్లో అన్నదాతలకు అఖండ విజయం చేకూరిందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఐదేళ్లపాటు నీటిపారుదల రంగాన్ని నిర్వీర్యం చేసిన జగన్, అయన పార్టీకి ఈ ఎన్నికలు ఒక చెంపపెట్టు లాంటివని వ్యాఖ్యానించారు.కూటమిలోని అన్ని పార్టీల ఐఖ్యతకు అన్నదాతలు ఏకపక్షంగా మద్దతు పలికారన్నారు. సాగు నీటి సంఘాల ద్వారా రైతులకు రైతు బిడ్డలే సేవ చేసుకునేలా దాదాపు 60 వేల మందికి సాగునీటి రంగంలో ప్రాతినిధ్యం కల్పించామని.. ఇదీ నిజమైన రైతు ప్రభుత్వం అని అన్నారు. నీటిపారుదల వ్యవస్థ మరింత బలపడేందుకు అన్నదాతలు ఎంతో దోహదపడతారని ఆకాంక్షించారు. మొన్నటి సాధారణ ఎన్నికల్లో 93 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిస్తే, ఇప్పుడు జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్‌రేట్‌తో ఏకగ్రీవంగా విజయం సాధించామన్నారు. రైతుల సహకారంతో రాబోయే రోజుల్లో సాగు నీటి రంగాన్ని బలోపేతం చేసి, ప్రతి ఏకరాకు నీరు అందించి సిరుల పంటలు పండిస్తామని మంత్రి వెల్లడించారు.

## స్కేటింగ్ రంగంలో దూసుకుపోతున్న జెస్సీరాజ్

### -ప్రధానమంత్రి జాతీయ బాల పురస్కార్ అవార్డుకు ఎంపికైన చిన్నారి

### -జెస్సీ ఎంతోమంది యువ క్రీడాకారులకు స్ఫూర్తి

### -ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసా

**అమరావతి:** గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన స్కేటింగ్ క్రీడాకారిణి జెస్సీరాజ్ ను ప్రతిష్ఠాత్మక 'ప్రధానమంత్రి జాతీయ బాల పురస్కార్ - 2025' వరించింది. ప్రతి ఏటా దేశవ్యాప్తంగా వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన 25 మంది చిన్నారులకు కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారాన్ని అందిస్తుంది. 14 ఏళ్ల జెస్సీరాజ్ ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతోంది. ప్రతిష్ఠాత్మకమైన పురస్కారానికి ఎంపికైన జెస్సీరాజ్ ను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... ప్రధానమంత్రి జాతీయ బాల పురస్కార్ అవార్డుకు ఎంపికైన స్కేటర్ జెస్సీరాజ్ కు అభినందనలు తెలియజేశారు. ఆమె సాధించిన విజయాలు ఏపీకి గర్వకారణమని చెప్పారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకోబోతున్నారని తెలిపారు. 9 ఏళ్ల వయసులో ఆమె స్కేటింగ్ రంగంలో తన ప్రయాణాన్ని ప్రారంభించిందని... ఆమె పట్టుదల, అంకితభావం ఆమెను ఈరోజు గొప్ప గౌరవాన్ని అందుకునే స్థాయికి తీసుకొచ్చిందని కొనియాడారు. ఎంతో మంది యువ క్రీడాకారులకు ఆమె ఒక స్ఫూర్తి అని చెప్పారు. ఇటీవల జరిగిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్స్ లో సోలో డ్యాన్స్ లో ఆమె సిల్వర్ మెడల్ సాధించారు.

## మార్చి నెల దర్శన టికెట్ల విడుదల తేదీల్లో మార్పులు

**అమరావతి,డిసెంబర్ 21(నినాదం న్యూస్):** శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం కీలక అప్డేట్ ఇచ్చింది. మార్చి నెల దర్శన టిక్కెట్ల విడుదల తేదీల్లో మార్పులు చేసింది. ఈ మేరకు తాజా ప్రకటన విడుదల చేసింది. డిసెంబర్ 25వ తేదీన ఉదయం 11 గంటలకు మార్చి నెల శ్రీవాణి దర్శన టిక్కెట్లను విడుదల చేయనున్నట్లు టీటీడీ ప్రకటించింది. ఇక డిసెంబర్ 26వ తేదీన ఉదయం 11 గంటలకు రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను అందుబాటులోకి తీసుకురానుంది. ఇదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతి, తిరుమలలోని వసతి గదులు కోటా టికెట్లను విడుదల చేయనుంది. ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం%చి% మార్చి నెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను డిసెంబరు 24న విడుదల కావాల్సి ఉంది. ఇక డిసెంబర్ 23న ఉదయం 11 గంటలకు వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి శ్రీవాణి టికెట్లు ఆన్ లైన్ లో విడుదల చేస్తామని పేర్కొంది. కానీ తాజా ప్రకటనలో పలు మార్పులు చేసింది. మార్పులకు అనుగుణంగా భక్తులు టికెట్లను బుకింగ్ చేసుకోవాలని టీటీడీ కోరింది. సైట్లలో మాత్రమే టికెట్లను బుక్ చేసుకోవాలని సూచించింది. ఇతర సైట్లను నమ్మవద్దని కోరింది. డిసెంబరు 21న ఆర్జిత సేవా టికెట్లు : కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను డిసెంబరు 21న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన 2025 మార్చి నెల కోటాను డిసెంబరు 21న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. మార్చి నెలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను డిసెంబరు 23న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా మార్చి నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను డిసెంబరు 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

## జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు

**అమరావతి,డిసెంబర్ 21(నినాదం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ పాలిటిక్స్‌లో ఢీ అంటే ఢీ అంటూ నిత్యం రాజకీయ విమర్శలు, ఆరోపణలు గుప్పించుకుంటుంటారు. వారే ఏపీ ప్రస్తుత సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. రాజకీయ వైరాన్ని పక్కన పెట్టి ఇవాళ (డిసెంబర్ 21) పుట్టిన రోజు జరుపుకుంటున్న వైఎస్ జగన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ కూడా జగన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో దీర్ఘకాలం ప్రజాసేవలో కొనసాగాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. వైసీపీ కీలక నేత విజయసాయి రెడ్డి కూడా సోషల్ మీడియాలో జగన్‌కు బర్త్‌డే విషెస్ చెప్పారు."వైఎస్ జగన్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మంచి ఆరోగ్యంతో దీర్ఘాయువు పొందాలని కోరుకుంటున్నాను" అంటూ సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. కాగా, జగన్ బర్త్‌డే వేడుకలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నాయి. అభిమానులు కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకుంటున్నారు. ఇక సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు చెబుతున్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి గొట్టిపాటి

**అమరావతి,డిసెంబర్ 21(నినాదం న్యూస్):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకిలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి .. ఒకేసారి 111 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల నిమిత్తం 1 కోటి 26 లక్షల 71 వేల 93 రూపాయల విలువైన చెక్కులతో పాటు ఆరుగురికి ఆపరేషన్ల నిమిత్తం 29 లక్షల 80 వేల విలువైన ఎల్ఓసీలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూనే .. మరో పక్క హార్ట్, కేన్సర్, కిడ్నీ వంటి ప్రాణాంతక వ్యాధులతో బాధపడే నిరుపేద రోగులకు వైద్య ఖర్చుల భారం పడకుండా సకాలంలో సీఎంఆర్ఎఫ్ ఫండ్ కింద నిధులు విడుదల చేస్తోందని తెలిపారు. అంతే కాకుండా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ఆపరేషన్ల నిమిత్తం సమయానికి ఎల్ఓసీలు అందజేస్తూ వారి ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇది ప్రజల ప్రభుత్వమని, ప్రజల కష్టాల్లో అండగా నిలిచే నిజమైన మానవీయ ప్రభుత్వమని పేర్కొన్నారు

# ఆసుపత్రికి తరలించాలంటే డోలీ కట్టాల్సిందే

**-గిరిజన బతుకుల్లో తీరని డోలీ కష్టాలు**


**-కనీస వైద్యం, మౌలిక సదుపాయాలు లేని వందలాది గ్రామాలు**



**అమరావతి,డిసెంబర్ 21(నినాదం న్యూస్):** ప్రజల జీవన ప్రమాణాల దృష్ట్యా అభివృద్ధిని అంచనా వేస్తారు. అయితే ఆంధ్రప్రదేశ్ లోని పలు గ్రామాల్లో కనీసం వైద్య సదుపాయాలు లేని పరిస్థితి ఉంది. ముఖ్యంగా మన్యం గ్రామాల్లో చిన్న పాటి వైద్యానికి సైతం డోలీ కష్టాలు తప్పవు. గిరిజన ప్రాంతాలలో జీవిస్తున్న వారు కనీస సదుపాయాలకు నోచుకోవడంలేదు. కనీస రహదారులు లేక జీవ పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడుస్తున్న కనీస వైద్య సదుపాయాలకు నోచుకోని వందల గ్రామాలు మన్యం ప్రాంతాల్లో ఉన్నాయి. వృద్ధులు, గర్భిణీలు..అత్యవసర చికిత్సలకు డోలీలనే ఆశ్రయించాల్సిన పరిస్థితులు నేటికీ కనిపిస్తున్నాయి. ప్రభుత్వాలు ఎన్ని మారినా... కనీసం రోడ్లు వేయలేకపోతున్నారని గొంతులేని ఆ గిరిజనులు మౌనంగా ప్రశ్నిస్తున్నారు. కొండలు, గుట్టలు దాటి డోలీలపై బాధితులను మోస్తూ ప్రాణాలు నిలబెట్టేందుకు నిత్యం పోరాడుతున్నారు. ఉన్న ఒకటి అర మొబైల్ అంబులెన్స్ లు సరైన రోడ్డు సదుపాయాలు లేక గ్రామాలను చేరుకోలేకపోతున్నాయి. సరైన సమయానికి వైద్య సదుపాయాలు అందక నెలకు కనీసం 5-10 మరణాలు సంభవిస్తున్నాయని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఏజెన్సీలోని 11 మండలాల్లో 244 గ్రామ పంచాయతీల పరిధిలో 3,915 గిరిజన గ్రామాలున్నాయి. వీటిలో 1,724 గ్రామాలకు మాత్రమే తారురోడ్డు సదుపాయం ఉంది. మిలిగిన 2,191 గ్రామాలకు ఎలాంటి రోడ్డు సదుపాయం లేదు. దీంతో ఏజెన్సీల్లోని గిరిజనులు కొండలు, కోనలు, వాగులు, వంకలు దాటుకుంటూ ఓ మహాయుద్ధమే చేసి బాహ్య ప్రపంచాన్ని చేరుకుంటారు. అనారోగ్య సమస్యలు, గర్భిణీలకు పురిటి నొప్పులు వచ్చినప్పుడు వీరి అవస్థలు వర్ణనాతీతం. రోగులను, గర్భిణీలను డోలీల్లో కొండ కోనల్లోంచి, ప్రమాదకరమైన దారుల్లో పదుల కిలోమీటర్లు మోసుకుని వచ్చి రోడ్డున్న ప్రాంతాలకు చేరుస్తారు. అక్కడి నుంచి అంబులెన్సుల్లో ప్రభుత్వ ఆస్పత్రులకు చేరుస్తారు. ఈ డోలీ ప్రయాణాల్లో చివరి వరకు చేరి ప్రాణాలు నిలబెట్టుకునే వారి శాతం తక్కువే. ఏజెన్సీలో నిత్యం ఏదో ప్రాంతంలో డోలీలు కనిపిస్తూనే ఉంటాయి. ఎన్నికల సమయాల్లో వచ్చి రోడ్డు వేస్తామని హామీలిచ్చి ఓట్లు వేయించుకునే నేతలు..ఎన్నికల తర్వాత మళ్లీ కనిపించరని గిరిపుత్రులు వాపోతుంటారు. రహదారుల సౌకర్యం లేకపోవడంతో గిరిజనులకు డోలీల మోతలు తప్పడం లేదు. పురిటి నొప్పులు వచ్చిన గర్భిణీలను, అస్వస్థతకు గురైన బాలింతలను, దీర్ఘకాలిక వ్యాధుల బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న వారిని ఆస్పత్రికి తరలించాలంటే డోలీ కట్టాల్సిందేనని అంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ కష్టాలు ఎవరికీ పట్టడంలేదని వాపోతున్నారు. వర్షాకాలంలో తమ పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుందని, కనీసం నిత్యావసరాలు కూడా తెచ్చుకోలేని పరిస్థితులు ఉంటాయని వాపోతున్నారు. తమ నుంచి ఆదాయం రావడంలేదనే ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని అంటున్నారు. గిరిజన ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తే గంజాయి సాగును అరికట్టవచ్చని చెబుతున్నారు. తమ ఆర్థిక పరిస్థితులు బాగాలేక చాలా మంది గంజాయి సాగు వైపు వెళ్తున్నారని, రోడ్లు, నీరు, వైద్య సదుపాయాలు కల్పిస్తే తాము ఇతర ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు, పనులు చేసుకుంటామని అంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కనీసం రోడ్లు వేయించాయని కోరుతున్నారు.

# వాయుగుండంగా తీవ్ర అల్పపీడనం..!

**ఏపీలోని పలు జిల్లాలకు భారీ వర్ష సూచన**



**అమరావతి,డిసెంబర్ 21(నినాదం న్యూస్):** పశ్చిమ మధ్య ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం.. వాయుగుండంగా మారింది. అంతేకాకుండా దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి సగటు 5.8 కి.మీ వరకు విస్తరించి ఉందని ఐఎండీ పేర్కొంది. ఈ వాయుగుండం%చి% ఉత్తర-ఈశాన్య దిశగా కదులుతూ%చి% తదుపరి 24 గంటల వరకు తీవ్రతను కొనసాగిస్తుందని అంచనా వేసింది. వాయుగుండం ప్రభావంతో.. మరో రెండు రోజుల పాటు కోస్తా జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. కాకినాడ, అల్లూరి, మన్యం, అనకాపల్లి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు చెబుతున్నారు. గంటకు 50 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని హెచ్చరిస్తున్నారు. దీంతో అన్ని పోర్టుల్లో 3వ నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.. ఇక కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య,చిత్తూరు మరియు తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. భారీ వర్ష సూచనల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మరోవైపు తెలంగాణకు వాతావరణశాఖ వర్ష సూచన ఇచ్చింది. ఈ మూడు రోజులపాటు పొడి వాతవరణం ఉంటుందని తెలిపింది. అయితే డిసెంబర్ 24వ తేదీ నుంచి రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఎలాంటి హెచ్చరికలు లేవని స్పష్టం చేసింది. డిసెంబర్ 24వ తేదీ నుంచి తెలంగాణలో తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు పలుచోట్ల పడుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఎలాంటి హెచ్చరికలు లేవని తెలిపింది. డిసెంబర్ 26వ తేదీ వరకు తెలంగాణలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఎలాంటి హెచ్చరికలు లేవని స్పష్టం చేసింది.

# చాగంటికి మరో బాధ్యతను అప్పగించిన ఏపీ ప్రభుత్వం

**అమరావతి :** ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును విద్యార్థులు - నైతిక విలువల సలహాదారుగా ఏపీ ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. కేబినెట్ హోదా కలిగిన ఈ బాధ్యతలను ఆయనకు ప్రభుత్వం అప్పగించింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత ఆయన బాధ్యతలను స్వీకరించారు. తాజాగా చాగంటికి ఏపీ ప్రభుత్వం మరో కీలక బాధ్యతను అప్పగించింది. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంచేందుకు చాగంటితో ప్రభుత్వం ప్రత్యేకంగా పుస్తకాలను తయారు చేయించి, విద్యార్థులకు పంపిణీ చేయనుంది. రెండు రోజుల క్రితం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కేబినెట్ నిర్ణయం మేరకు చాగంటికి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ బాధ్యతలను స్వీకరిస్తున్నట్లు చాగంటి తెలిపారు. పిల్లలకు ఉపయోగపడేలా నాలుగు మంచి మాటలు చెప్పాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతలను స్వీకరిస్తున్నానని చెప్పారు. పదవుల కోసం తాను ఒప్పుకోలేదని... తన మాటలతో పిల్లలకు మేలు జరిగితే చాలని అన్నారు.

# సత్యసాయి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**-ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మినీ వ్యాన్**

**-నలుగురు మృతి, 9 మందికి గాయాలు**



**అమరావతి,డిసెంబర్ 21 (నినాదం న్యూస్):** అనంతపురం శ్రీ సత్యసాయి జిల్లాలో తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మడకశిర మండలంలో బుళ్లసముద్రం దగ్గర్లో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మినీ వ్యాన్ వేగంగా ఢీకొట్టింది. దీంతో మినీ వ్యాన్ లో ఉన్న నలుగురు మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. 9 మందికిపైగా గాయపడ్డారు. మృతులను గుడిబండ, అమరాపురం మండలాల వాసులుగా గుర్తించారు. వీరు తిరుమల దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిలో మరో నలుగురి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. చికిత్స కోసం హిందూపురం, బెంగళూరు ఆసుపత్రులకు తరలించారు. ఈ రోడ్డు ప్రమాదంలో అశ్వార్, ప్రేమ్ కుమార్, రత్నమ్మతో పాటు డ్రైవర్ ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. హైదరాబాద్ - పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్కూటీ పై కాలేజీకి వెళ్తున్న ఇద్దరు బీటెక్ విద్యార్థులను అతివేగంతో వచ్చిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. అంతే కాదు ఆ బస్సు అక్కడి నుంచి వెళ్లిపోయింది. లోకేష్ అనే 20 సంవత్సరాల బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందాడు. మరొక విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకున్న పంజాగుట్ట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కోసం గాలిస్తున్నారు.

# శాసన సభ పదినిమిషాల ఆలస్యాన్ని తప్పుబట్టిన హరీశ్‌రావు

**-గత ప్రభుత్వంలో ఏనాడూ ఇలా జరగలేదు**



**హైదరాబాద్,డిసెంబర్ 21 (నినాదం న్యూస్):** గత ప్రభుత్వం హయాంలో ఏనాడూ శాసన సమావేశాలు ఆలస్యంగా ప్రారంభం కాలేదని, ప్రజాప్రతినిధులే సభా నిబంధనలు పాటించకుంటే ఎలా అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ అనుమతితో మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడారు. సమయం 10:10 కావొచ్చింది. ఈ సెషన్‌లో ఏ ఒక్క రోజు కూడా అసెంబ్లీ పది అంటే పది గంటలకు ప్రారంభం కాలేదు. మీరు లాస్ట్ సెషన్ చూడండి.. పదేండ్లు సభ నడిపితే.. పది అంటే పది గంటలకు కచ్చితంగా ఠంచన్‌గా సభ నడిపాం. సభ సమయ పాలన పాటించడం ముఖ్యం. ప్రతి రోజు ఈ సెషన్‌లో 5, 10, 15 నిమిషాలు ఆలస్యంగా సభ ప్రారంభం కావడం కరెక్ట్ కాదు. సభ అందరికీ ఆదర్శంగా ఉండాలి. మనమే ఇలా ఆలస్యంగా నడపడం కరెక్ట్ కాదని మనవి చేస్తున్నానని హరీశ్‌రావు పేర్కొన్నారు. అనంతరం స్పీకర్ అనుమతితో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చ ప్రారంభించారు. రైతు భరోసా విధివిధానాలపై సూచనలు ఇవ్వాలని మంత్రి తుమ్మల సభ్యులను కోరారు. సంక్రాంతి పండుగ నాటికి రైతు భరోసాపై విధివిధానాలను ఖరారు చేసి, ఆ తర్వాత రైతు భరోసా చెల్లింపులు చేస్తామని మంత్రి ప్రకటించారు.

# హామీలు,మేనిఫెస్టోలపై బిఆర్ఎస్ అబద్దాలు

**-కాళేశ్వరంతో ఒక్క ఎకరాకు కూడా నీరివ్వలేదు**

**-దళితుడిని సిఎం చేస్తానని దగా చేసిన కెసిఆర్**

**-అసెంబ్లీలో హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డ కోమటిరెడ్డి**

**హైదరాబాద్,డిసెంబర్21(నినాదం న్యూస్):** అసెంబ్లీలో కాళేశ్వరం నీళ్లపై జగడం మొదలైంది. మాజీ మంత్రి హరీష్ రావుకు మంత్రి కోమటి రెడ్డి సవాల్ విసిరారు. నల్గొండ జిల్లాకు కాళేశ్వం నీరు చేరాయన్నా దానిపై సభలో గందగోళం ఏర్పడిరది. దీంతో మంత్రి కోమటి రెడ్డి సభలో మాట్లాడుతూ.. నల్గొండ జిల్లాలో కాళేశ్వరం నీళ్లు ఒక్క ఎకరానికి ఇచ్చినట్లు నిరూపించినా తాను రాజీనామా చేస్తానని మంత్రి అన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఏం మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. చర్చకు రావాలని హరీష్ రావు, కేటీఆర్ లకు సవాల్ విసిరిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్గొండకు నీళ్లు ఎవరు ఇచ్చారో అడగాలని ప్రశ్నించారు. నల్గొండ జిల్లాలో ఎకరాకు కాళేశ్వరం నీళ్లు ఇచ్చారని నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వల్లే ఏఎంఆర్‌బీ వచ్చిందని గుర్తు చేశారు.తన బావ, మామ నల్గొండ ప్రజలను చంపేస్తారా? వాళ్ళని చంపేయండి అని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి మూసీని సరిచేస్తున్నారన్నారు. అందుకు కూడా తన బావ, మామ అడ్డుపడుతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంటు ఇవ్వలేదన్నారు. 24గంటల కరెంట్ ఇవ్వలేదని లాగ్ బుక్స్ తెచ్చి చూపిస్తా అన్నారు. ఎక్సైజ్ టెండర్లు ఒక ఏడాది ముందు పెట్టారు.. రూ.2 వేల కోట్లు ముందుగా వసూలు చేశారన్నారు. కేటీఆర్ సభను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో కేవలం 14 గంటల కరెంటు మాత్రమే ఇచ్చారన్నారు. నేను సబ్ స్టేషన్ వెళ్లి చెక్ చేశానని తెలిపారు. నేను ఎమ్మెల్యే, ఎంపీగా గత పదేళ్లుగా పని చేశానని సభలో తెలిపారు. కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంటు ఇవ్వలేదన్నారు. ఎక్సైజ్ టెండర్లు 2లక్షలు పెట్టి రూ.2వేల కోట్లు వసూలు చేశారు? ఆ డబ్బులు ఎక్కడికి వెళ్ళాయో తెలీదన్నారు. తెలంగాణ వచ్చాక నష్టపోయిన జిల్లా నల్గొండ అని తెలిపారు. తెలంగాణ వస్తే దళితున్ని ముఖ్యమంత్రి చేస్తా అన్నారు కేసీఆర్ మాట తప్పారని తెలిపారు. హామీల గురించి, మేనిఫెస్టోల గురించి బిఆర్ఎస్ మాట్లాడడంవిడ్డూరంగా ఉందన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలన..పందేళ్లు వెనక్కి తీసుకెళ్ళారని కీలక వ్యాఖ్యలు చేశారు. కూలిపోయే ప్రాజెక్టులు మాత్రమే కట్టారన్నారు. ఇంటింటికి నీళ్లు ఇయ్యకపోతే ఓట్లు అడుగా అన్నావ్ అన్నారు. సిరిసిల్లకు పోదాం ఏ ఇంటికి నీళ్లు వస్తున్నాయో తెలుస్తుందన్నారు. నల్గొండ జిల్లా సూర్యాపేటకు వెళ్దాం అన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు కట్టింది ఎవరు? అని ప్రశ్నించారు. బావ,బామ్మర్దికి నల్గొండ జిల్లాపై కోపం ఎందుకని మండిపడ్డారు. మాకు విషం ఇచ్చి చంపండని మంత్రి తెలిపారు. ఉచిత విద్యుత్ అందించింది కాంగ్రెస్.. దాని పేటెంట్ హక్కూ కాంగ్రెస్‌దే. భారాస పాలనలో నీళ్ల, విద్యుత్.. ఏవీరీ ఇవ్వలేదు. వాళ్ల పాలనలో కూలిపోయే ప్రాజెక్టులు కట్టారు. మిషన్ భగీరథ ద్వారా కుళాయి నీళ్లు వచ్చాయని ప్రజలు చెబితే.. మరో సారి ఓట్లు అడగం. మిషన్ భగీరథలో రూ.50 వేలకోట్లు తినేశారు' అని కోమటిరెడ్డి ఆరోపించారు. అయితే మంత్రి ఆరోపణలను భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ఖండిరచారు. 'మిషన్ భగీరథకు అయిన ఖర్చు రూ.28 వేల కోట్లు. రూ.50 వేల కోట్లు తిన్నారని మంత్రి కోమటిరెడ్డి ఎలా మాట్లాడతారు? మంత్రి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలి. కాళేశ్వరం ద్వారా నల్గొండ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు నీళ్లు అందించాం. నల్గొండలో వైద్య కళాశాల పెట్టింది కేసీఆర్. ఉమ్మడి నల్గొండలో యాదాద్రి పవర్ ఎ÷%-%లాంట్‌ను ఏర్పాటు చేశాం' అని హరీశ్ రావు అన్నారు.

## ప్రభుత్వ కార్యక్రమాలకు ఎమ్మెల్సీలను ఆహ్వానించాల్సిందే : మండల చైర్మన్

**హైదరాబాద్,డిసెంబర్ 21 (నినాదం న్యూస్):** భూభారతి బిల్లుపై స్వల్పకాలిక చర్చ జరుగుతున్నది. ఈ సందర్భంగా భూభారతి చట్టం అమల్లోకి రాకముందే పేపర్లలో ప్రకటనలు వచ్చాయని విపక్ష సభ్యులు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి దృష్టి తీసుకొచ్చారు. అదేవిధంగా ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని వెల్లడిరచారు. ఈ నేపథ్యంలో ఇలాంటి తప్పులు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి చైర్మన్ సూచించారు. అదేవిధంగా ప్రొటోకాల్ అమలులో అలసత్వం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఎమ్మెల్సీలను ఆహ్వానించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రొటోకాల్‌పై ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కాగా, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 2024 బిల్లును, తెలంగాణ పంచాయతీరాజ్ బిల్లును మండలిలో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ప్రస్తుతం రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చ కొనసాగుతున్నది.

## మర్రి జనార్ధన్‌రెడ్డి ఇంట్లో విషాదం

**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 21(నినాదం న్యూస్):** నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఇంట్లో విషాదం నెలకొన్నది. ఆయన తండ్రి మర్రి జంగిరెడ్డి (80) తుది శ్వాస విడిచారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన జూబ్లీహిల్స్‌లోని అపోలో దవాఖానలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారుజామున మృతిచెందారు. దీంతో ఆయన భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి వారి స్వగ్రామం తిమ్మాజీపేట మండలం నేరేళ్లపల్లికి తీసువెళ్లనున్నారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

## నీటి సంఘాల ఎన్నికలు చెంపపెట్టు

**-మంత్రి నిమ్మల రామానాయుడు**

**అమరావతి,డిసెంబర్21(నినాదం న్యూస్):** ఆరేళ్ల తర్వాత నిర్వహించిన సాగు నీటి సంఘాల ఎన్నికల్లో అన్నదాతలకు అఖండ విజయం చేకూరిందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఐదేళ్లపాటు నీటిపారుదల రంగాన్ని నిర్వీర్యం చేసిన జగన్, అయన పార్టీకి ఈ ఎన్నికలు ఒక చెంపపెట్టు లాంటివని వ్యాఖ్యానించారు.కూటమిలోని అన్ని పార్టీల ఐఖ్యతకు అన్నదాతలు ఏకపక్షంగా మద్దతు పలికారన్నారు. సాగు నీటి సంఘాల ద్వారా రైతులకు రైతు బిడ్డలే సేవ చేసుకునేలా దాదాపు 60 వేల మందికి సాగునీటి రంగంలో ప్రాతినిధ్యం కల్పించామని.. ఇదీ నిజమైన రైతు ప్రభుత్వం అని అన్నారు. నీటిపారుదల వ్యవస్థ మరింత బలపడేందుకు అన్నదాతలు ఎంతో దోహదపడతారని ఆకాంక్షించారు. మొన్నటి సాధారణ ఎన్నికల్లో 93 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిస్తే, ఇప్పుడు జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్‌రేట్‌తో ఏకగ్రీవంగా విజయం సాధించామన్నారు. రైతుల సహకారంతో రాబోయే రోజుల్లో సాగు నీటి రంగాన్ని బలోపేతం చేసి, ప్రతి ఎకరాకు నీరు అందించి సిరుల పంటలు పండిస్తామని మంత్రి వెల్లడిరచారు.

## రాబిన్ ఊతప్పకు అరెస్ట్ వారెంట్

**పీఎఫ్ అంశంపై మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు**

**బెంగుళూరు,డిసెంబర్ 21 (నినాదం న్యూస్):** మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్పకు అరెస్టు వారెంట్ జారీ చేశారు. ఉద్యోగులకు పీఎఫ్ ఇచ్చే అంశంలో అతను మోసానికి పాల్పడినట్లు తేలింది. అతనికి చెందిన బట్టల కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగుల ఖాతాల్లోకి పీఎఫ్ జమ చేయలేదు. అయితే 27వ తేదీ వరకు అతని టైం కల్పించారు. ఒకవేళ 24 లక్షల బకాయి చెల్లించకుంటే అతన్ని అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయి. బెంగుళూరుకు చెందిన సెంటౌరస్ లైఫ్ స్టయిల్ బ్రాండ్స్ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్నాడు. ఆ కంపెనీ సుమారు 24 లక్షలు చెల్లించాల్సి ఉంది. కానీ ఆ డబ్బులు అతను చెల్లించలేదని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ సదాక్షరి గోపాల్ రెడ్డి తన అరెస్టు వారెంట్‌లో పేర్కొన్నారు. డిసెంబర్ నాలుగవ తేదీన ఆ వారెంట్ జారీ చేశారు. ఉద్యోగులకు చెందిన పీఎఫ్ అమౌంట్‌ను విత్‌డ్రా చేసినట్లు ఊతప్పపై ఆరోపణలు ఉన్నాయి. అయితే అతను ఉద్యోగుల అకౌంట్లలోకి నిధులను డిపాజిట్ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పేద కార్మికుల పీఎఫ్ అకౌంట్లను సెటిల్ చేయని ఊతప్పను అరెస్టు చేయాలని లేఖలో కోరారు. భారత జట్టు తరపున 59 అంతర్జాతీయ మ్యాచ్‌లను ఆడాడు. ఐపీఎల్‌లో అతను పాపులర్ ప్లేయర్. ఇంటర్నేషనల్ కెరీర్‌లో ఊతప్ప 1183 రన్స్ చేశాడు. దాంట్లో ఏడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

## రైతుభరోసాపై తుది నిర్ణయం తీసుకోలేదు

**హైదరాబాద్,డిసెంబర్21(నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. 'మేం ఇచ్చిన నోట్‌లో రైతు భరోసాపై ఏవిధీ చెప్పలేదు.



# చూడ్డానికే అమాయకంగా ఉంటా..

**సోయగం**
**Soyagam**

'మా నాన్న స్టేజ్ ఆర్టిస్ట్. ఆ ప్రభావం నాపై తెలియకుండానే పడింది. అందుకే కెరీర్ పరంగా వేరే ఆప్షనేం పెట్టుకోలేదు. సెకండ్ ఇంటర్ అవ్వగానే జమ్ము నుంచి ముంబై వచ్చి యాక్టింగ్ కోర్స్‌లో చేరిపోయాను. కోర్స్ అవ్వగానే ఆడిషన్స్ ఇవ్వడం మొదలుపెట్టా. కొన్ని యాడ్స్‌లో నటించా. హీరోయిన్‌గా 'డ్రింకర్ సాయి' నా తొలి సినిమా' అని తెలిపింది ఐశ్వర్యశర్మ. 'డ్రింకర్ సాయి' సినిమా ద్వారా ఆమె కథానాయికగా పరిచయం అవుతున్నది. ధర్మ హీరోగా కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించింది ఐశ్వర్యశర్మ . 'ఇది అద్భుతమైన ప్రేమకథ. ఇందులో నా పాత్ర పేరు బాగీ. మెడికల్ స్టూడెంట్‌ని. చాలా బలమైన పాత్ర. చూడ్డానికి ఇన్నోసెంట్‌గా కనిపిస్తా. కానీ రఫ్ అండ్ టఫ్‌గా ఉంటా. రెగ్యులర్ హీరోయిన్లకు భిన్నమైన పాత్ర అనమాట. ఛాలెంజ్‌గా తీసుకొని చేశా.' అని తెలిపింది ఐశ్వర్య శర్మ. డ్రింకర్ సాయిగా ధర్మ చాలా బాగా నటించారని, సాంకేతికంగా అన్ని విధాలుగా సినిమా బావుంటుందని, అర్జున్‌రెడ్డికీ డ్రింకర్‌సాయికీ పోలిక లేదని, అర్జున్ క్లాసీ డ్రింకర్ అయితే.. సాయి మ్యాసీ డ్రింకర్ అని చెప్పింది ఐశ్వర్యశర్మ.